సాక్షి పెద్దపల్లి

గురువారం । 3 । జూలై । 2025



లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు

గోదావరిఖని: నగరంలోని పలు లాడ్జిల్లో పోలీసులు బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అసాంఘికశక్తుల ప్రవేశించారనే సమాచారంతో తనిఖీలు చేశారని తెలిసింది.



రైల్వే సేవలన్నీ ఒకే యాప్‌లో..

రైల్వే సేవలు అన్నింటినీ ఒకే యాప్‌లో పొందేలా ఆ శాఖ ఉన్నతాధికారులు యాప్‌ను డిజైన్ చేశారు. ఈనెల ఒకటో తేదీనుంచి ఇది అందుబాటులోకి వచ్చింది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. జిల్లాలోని పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హోంగార్డులకు రెయిన్‌కోట్లు



హోంగార్డులతో సీపీ అంబర్ కిశోర్ ఝా

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోంగార్డులకు సీపీ అంబర్ కిశోర్ ఝా బుధవారం రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో విధి నిర్వహణలో ఇబ్బందులు పడకుండా రెయిన్ కోట్స్ అందజేసినట్లు సీపీ పేర్కొన్నారు. వర్షాకాలంలో ట్రాఫిక్ నియంత్రణ, రాత్రి విధులు, బందోబస్తులో రెయిన్ కోట్లు సహాయపడుతాయని అన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ డీసీపీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, హోంగార్డు ఆర్ఐ వామనమూర్తి పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ ఆదాయంపై దృష్టి

కోల్‌సిటీ(రామగుండం): ట్రేడ్ లైసెన్స్‌పై ఆదాయంపై బల్దియా అధికారులు ఫోకస్ పెట్టారు. నిర్వహణకు సాధారణ నిధులతోపాటు ఆస్తిపన్ను తర్వాత ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా వచ్చే ఆదాయంపైనే దృష్టి సారిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 3,036 వరకు అసెస్మెంట్లు ఉండగా, వీటిపై రూ.55.89లక్షల డిమాండ్ ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అసెస్మెంట్ల సంఖ్య 3,782 వరకు పెరిగింది. డిమాండ్ కూడా రూ.71.93లక్షలకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరాంతానికి ట్రేడ్‌లైసెన్స్ డిమాండ్ మొత్తంలో 72.16 శాతం వసూలు కాగా, ఈ ఆర్థిక సంవత్సరం త్రైమాసికంలోపే 50 శాతానికిపైగా వసూలు కావడం విశేషం. ప్రస్తుతం చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ద్వారా డీ అండ్ వో ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు.. వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఏకకాలంలో కొత్తలైసెన్స్‌లూ జారీచేస్తున్నారు. ప్రతీవ్యాపార సంస్థను డీ అండ్ వో ట్రేడ్ లైసెన్స్ పరిధిలోకి తీసుకొచ్చి మెరుగైన ఆదాయం వచ్చేలా కృషి చేస్తున్నారు.

చురుగ్గా పనిచేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): మెప్మా సిబ్బంది చురుగ్గా పనిచేయాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ సూచించారు. తన కార్యాలయంలో బుధవారం మెప్మా సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్షించారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాన్ని నెరవేర్చాలని, వీధి వ్యాపారుల కామన్ ఇంటరెస్ట్ గ్రూప్‌లు, నూతన స్వయం సహాయక సంఘాలు, స్లమ్ లెవెల్ ఫెడరేషన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. రుణాలను రికవరీలోనూ చొరవ తీసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణం పూర్తిచేసుకోవడానికి బ్యాంకుల ద్వారా ఆర్థిక సహకారం అందేలా చూడాలన్నారు. ఇందిరమ్మ మోడల్ కాలనీ నిర్మించడానికి అనువుగా ఉండే ప్రాంతాలను గుర్తించి సమాచారం ఇవ్వాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్, మెప్మా టీఎంసీ మానిక, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

గోదావరిఖని: సీజనల్ వ్యాధులపై కార్మిక కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలని సింగరేణి ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ పద్మ కోరారు. బుధవారం ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే-5 ఓసీపీపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతీ ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు రాకుండా జాగ్రత్త పడాలని, కలుషిత ఆహారం తీసుకోవద్దని, కలుషిత నీటిని తాగవద్దని ఆమె సూచించారు. నీటిని మరిగించి చల్లారాక వడిపోసి తాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ అనిల్‌గబాలే, రక్షణాధికారి రాములు, ఇంజినీర్ వేణుగోపాల్, సీనియర్ సర్వే ఆఫీసర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ బస్సు

మంథని: ఆషాఢ శుక్ల పౌర్ణమి(గురుపౌర్ణమి) సందర్భంగ అరుణాచల గిరి ప్రదక్షిణకు మంథని డిపో నుంచి ఈనెల 8న సూపర్ లగ్జరీ బస్సు బయలు దేరుతుందని డీఎం శ్రావణ్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్, హైదరాబాద్ నుంచి వెళ్లే బస్సు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనం తర్వాత ఈనెల 9న రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. ప్రదక్షిణ అనంతరం సాయంత్రం అరుణాచలంలో బస్సు బయలుదేరి ఈనెల 11న గద్వాల జోగులాంబ టెంపుల్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం గద్వాలలో బయలుదేరి హైదరాబాద్, కరీంనగర్, పెద్దపల్లి నుంచి మంథనికి చేరుకుంటుందన్నారు. మంథని నుంచి పెద్దలకు రూ.5,040, పిల్లలకు రూ.3,790, పెద్దపల్లి నుంచి పెద్దలకు రూ.4,940, పిల్లలకు రూ.3,720 చార్జీ ఉంటుందని పేర్కొన్నారు. అడ్వాన్స్ బుకింగ్ కోసం 99592 25923, 94913 24172 నంబర్లలో సంప్రదించాలని డీఎం కోరారు.

చినుకు పడితే చిత్తడే..



ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట రోడ్డు



గుంతలుగా మారిన రహదారి



పోలీస్‌స్టేషన్ - రామాలయం మధ్య నీటి గుంతలు

సుల్తానాబాద్ మున్సిపల్ హోదా దక్కించుకుని ఏళ్ల గడుస్తోంది. కానీ, పట్టణ రోడ్లు ఏమాత్రం అభివృద్ధికి నోచుకోవడంలేదు. ఎక్కడ చూసినా గుంతలుపడి అధ్వానంగా తయారయ్యాయి. చినుకుపడితే నీరు నిలిచి బురదగా మారుతున్నాయి. రాకపోకలకు నరకం చూపుతున్నాయి. అయినా, ఎవరూ వీటిపై దృష్టి సారించడంలేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

దోమ కుడుతోంది!

- దోమల మోత – ప్రజల వెత
- కానరాని నియంత్రణ చర్యలు
- మూలనపడిన ఫాగింగ్ యంత్రాలు
- మొక్కుబడిగా పారిశుధ్య పనులు
- జ్వరాల బారిన జిల్లావాసులు
- జిల్లాలోని బల్దియాల్లో దుస్థితి



ఇవి హ్యాండ్ ఫాగింగ్ మిషన్లు. సుమారు రూ.5లక్షలు వెచ్చించి రామగుండం నగరపాలక సంస్థ అధికారులు కొనుగోలు చేశారు. దోమల నివారణ కోసం వీటిని వినియోగిస్తారు. ఈ ఏడాది మార్చి 11న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ లాంఛనంగా ప్రారంభించారు. అంతే.. అప్పట్నుంచి వినియోగించడంలేదు. ఇప్పటికే ఉన్న పాతవాటిని కూడా ఇలాగే మూలన పడేశారు. ఆటో ట్రాలీలో ఏర్పాటు చేసిన రెండు పెద్దఫాగింగ్ మిషన్లలో ఒక్కదానితోనే.. అదికూడా మొక్కుబడిగా నగరంలో ఫాగింగ్ చేస్తున్నారు. దోమల నివారణ జరక్కపోగా.. అవి మరింత వృద్ధి చెంది ప్రజల కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లోనూ ఇదే దుస్థితి కొనసాగుతోంది.



పెద్దపల్లిలో రాజీవ్ రహదారి వెంట పారుతున్న మురుగు

సాక్షి, పెద్దపల్లి: వివిధ వ్యాధులు, జ్వరాలకు దోమలు కారణమవుతున్నాయి. వాటి బారిన పడకుండా పుట్టకనే అడ్డుకోవాలి. ఆ తర్వాత అవి కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. దురదృష్టవశాత్తు పట్టణాలు, పల్లెల్లోనేకాదు.. రామగుండం నగరంలోనూ క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. వాతావరణంలో మార్పులకుతోడు పారిశుధ్య నిర్వహణలో లోపం ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తోంది. వర్షాలతో లోతట్టు కాలనీల్లోని నివాసాల నడుమ రోజుల తరబడి నీరు నిలిచి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. దోమ కాటుతో ఆస్పత్రుల పాలవుతున్నారు. జ్వర పీడితులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

అటకెక్కిన ఫాగింగ్ ప్రక్రియ

దోమల నివారణకు మూడు పద్ధతుల్లో చర్యలు తీసుకోవాలి. నీటి నిల్వల్లో దోమల నిరోధక మందు చల్లాలి. లార్వా వృద్ధి చెందకుండా రెండోసారి మందు పిచికారీ, మూడోసారి ఫాగింగ్ చేయాలి. ఖాళీ స్థలాలు, రహదారులపై మురుగు నిల్వ ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఫాగింగ్‌తో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లడం, కాలువల్లో మందు పిచికారీ చేయడం క్రమం తప్పకుండా జరగాలి. వర్షాకాలం మొదలైన వెంటనే డ్రైనేజీల్లో గంబూషియా చేపలు విడుదల చేయాలి. కానీ, క్షేత్రస్థాయిలో ఇలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు ఎక్కడా కనిపించడంలేదు. దోమల నివారణకు మున్సిపాలిటీలు ఏటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నట్లు చెబుతున్నా.. ప్రయోజనం చేకూరడం లేదు.

దోమల నివారణ ఇలా..

ఇళ్ల పరిసరాలు, వ్యక్తిగత, కుటుంబపరంగా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా నీటినిల్వ ప్రదేశాలు గుర్తించారు. నీటిని తొలగించాలి. పనికిరాని పాత్రలు, టైర్లు, పగిలిన బకెట్లు, నీటి తొట్టెలు ఇళ్ల పరిసరాల్లో లేకుండా చూడాలి. ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపులు, డ్రమ్ములు, నీటితొట్టెలపై మూతలు ఉంచాలి. వాటిని తరచూ శుభ్రం చేయాలి. ఇంటి పైకప్పు, టెర్రస్‌పైనా నీటి నిల్వలు ఉంచొద్దు. ప్రతీ శుక్రవారం డ్రైడేగా పాటించాలి. ఒకసారి వినియోగించి పారేసిన ప్లాస్టిక్ సంచులు, కప్పులు, గ్లాసులు డ్రైనేజీల్లో వేయరాదు. సెప్టిక్ ట్యాంకుల గాలిగొట్టాలకు నైలాన్ జాలి, ఇంటి కిటికీలు, గుమ్మాలకు జాలి, ఇనుప తెరలు అమర్చుకోవాలి. దోమతెరలు తప్పనిసరి వినియోగించాలి.

దోమల కాటు వ్యాధులు ఇవే..

దోమరకం	వ్యాధి
అనాఫిలిస్	మలేరియా
క్యూలెక్స్	బోదకాలు, మెదడువాపు
ఏడీస్	డెంగీ, చికున్‌గున్యా
మాక్సోనియా	బోదకాలు



రామగుండం కార్పొరేషన్‌లో మూలనపడిన ఫాగింగ్ యంత్రాలు

ఫాగింగ్ చేయాలి



గోదావరిఖనిలో దోమలు వృద్ధి చెందాయి. విపరీతంగా కుడుతున్నాయి. అధికారులు దోమల నివారణకు గతంలో వేగంగా చర్యలు తీసుకునేళ్లు. ఇప్పుడు ఫాగింగ్ కూడా చేయడం లేదు.

– బోళ్ల చంద్రశేఖర్, గోదావరిఖని

గంబూషియా చేపలు వదలాలి



ఇండ్ల నడుమ ఉన్న ఖాళీప్లాట్లు, గుంతల్లో వర్షపునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్లాట్లను శుభ్రం చేసి నీటిగుంతల్లో గంబూషియా చేపలు వదిలి దోమల వృద్ధిని అరికట్టాలి.

– పిట్ట వినయ్, పెద్దపల్లి

ఇటుక బట్టీలకు చెరువుమట్టి

- 9,185 టిప్పర్లలో రవాణా
- రూ.2.47 కోట్ల ఆదాయం
- కలెక్టర్ కోయ శ్రీహర్ష వెల్లడి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని చెరువుల ద్వారా ఇటుక బట్టీలకు 9,185 టిప్పర్లలో మట్టి తరలించడంతో రూ.2,47,99,500 ఆదాయం సమకూరిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. మట్టి తరలింపు ద్వారా సమకూరిన ఈ ఆదాయంలో రూ.2.44కోట్లు వెచ్చించి మంథని, ఓదెల, పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల్లో సీసీ రోడ్లు, ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల్లో సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో బుధవారం ఆయన పలు అంశాలపై సమీక్షించారు. పెద్దపల్లి, సుల్తానాబాద్‌లో పారిశుధ్యం మెరుగుపడాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం, నీటి సరఫరాపై దృష్టి సారిస్తూనే వనమహోత్సవంలో మొక్కలు నాటి సంరక్షించాలని పేర్కొన్నారు. ఈనెలాఖరు వరకు సుల్తానాబాద్‌లో డంప్‌యార్డు సమస్యకు పరిష్కారం చూపాలని, కాంట్రాక్టర్ పని చేయకుంటే పారిశుధ్య పనులను వేరొకరికి అప్పగించాలని కలెక్టర్ సూచించారు. తర్వాత మంథని మండలంలోని హెచ్‌ఎంలతో సమావేశమైన కలెక్టర్.. మండలంలో 59 పాఠశాలలున్నాయని, రోజూ ఫేషియల్ రికగ్నేషన్ హాజరు నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. డీఈవో మాధవి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

గుణాత్మక విద్య అందించాలి

ఎలిగేడు(పెద్దపల్లి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. సుల్తాన్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మాజీ సర్పంచ్, దివంగత తానిపర్తి కాంతారావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు సత్యనారాయణరావు, రవీందర్‌రావు, దామోదర్‌రావు, మహేందర్‌రావు, రంగారావు, వెంగళరావు రూ.5లక్షల విలువైన ఎలక్ట్రిక్ ఆటో, రూ.2.16లక్షల విలువైన డైనింగ్ టెబుళ్లు అందించగా కలెక్టర్ శ్రీహర్ష పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యా బోధనకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంఈవో నరేంద్రచారి, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- ఎంపీ వంశీకృష్ణ

రామగిరి(మంథని): అమ్మవారి దయతో అందరూ సుభిక్షంగా ఉండాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆకాంక్షించారు. అడ్రియాల గని ఆవరణలో బుధవారం చేపట్టిన పోచమ్మ బోనాల ఉత్సవం సందర్భంగా ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మకు సమర్పించే బోనం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

సేవలతోనే మంచిగుర్తింపు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ తప్పదని, అయితే అంకితభావంతో పనిచేస్తే మంచిగుర్తింపు లభిస్తుందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన శోభారాణి వీడ్కోలు సమావేశం బుధవారం నిర్వహించారు. జిల్లా విద్యాధికారి మాధవి, ఎంపీ వంశీకృష్ణ తదితరులు హాజరయ్యారు. భావిభారత పౌరులను ఉత్తములుగా తీర్చిదిద్దే అవకాశం ఉపాధ్యాయులకే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా శోభారాణి– ఈర్ల కొమురయ్య దంపతులను సత్కరించారు. ఎంఈవో సురేందర్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జీవన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎంపీ వంశీకృష్ణ

‘బహుళ’ ప్రమాదాలు

గోదావరిఖని శ్రీనగర్‌కాలనీలోని సింగరేణి ఉద్యోగి ఇంట్లో గతనెల 29న వంటగ్యాస్ లీకైంది. ఇళ్లంతా మంటలు వ్యాపించాయి. వస్తుసామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే పొగ వ్యాపించడంతో ఇంటి యజమాని స్వల్ప అస్వస్థతకు గురయ్యాడు.

- నిబంధనలకు తిలోదకాలు
- అపార్ట్‌మెంట్లలో భద్రత చర్యలు గాలికి

అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు

పెద్దపల్లి	87126 99202
గోదావరిఖని	87126 99206
మంథని	87126 99204



అగ్నిప్రమాదంలో చిక్కుకున్న ఓ భవనం(ఫైల్)

గోదావరిఖని: జిల్లాలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు వేగంగా వెలుస్తున్నాయి. ప్రస్తుత జనాభా అవసరాలకు అనుగుణంగా అపార్ట్‌మెంట్లు అనేకం నిర్మిస్తున్నారు. లిఫ్టులు, స్పెషల్ డిజైన్లలో నిర్మిస్తున్న అందమైన అంతస్తులు సరికొత్త శోభ తెచ్చిపెడుతున్నాయి. ఇదేసమయంలో భద్రతా చర్యలు విస్మరించడంతో తరచూ అగ్నిప్రమాదాలు, దొంగతనాలు, ఇతరత్రా ప్రమాదాలు చోటుచేసుకోవడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

తక్కువ ఎత్తులో నిర్మిస్తూ..

నిబంధనల ప్రకారం నివాస యోగ్యమైన అపార్ట్‌మెంట్లు 15 మీటర్లు, వాణిజ్య భవనాల ఎత్తు 18 మీటర్లు ఎత్తు ఉంటే ఫైర్‌సేఫ్టీ అధికారుల అనుమతి తప్పనిసరి. కానీ, ఇంతకన్నా తక్కువ ఎత్తులో నిర్మిస్తున్న భవనాలకు అనుమతి అవసరం లేకపోవడంతో కొందరు ఇష్టానుసారంగా నిర్మిస్తున్నారు. కానీ, ప్రమాదాలు చోటుచేసుకుంటే హైరానా పడడం తప్ప చేసేదేమీ ఉండడంలేదు.

వంట గ్యాస్ లీక్.. షార్ట్ సర్క్యూట్..

బహుళ అంతస్తుల్లో ప్రధానంగా వంటగ్యాస్ లీక్, షార్ట్‌సర్క్యూట్‌తోనే అధికంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెబుతున్నారు. దీంతోనే అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోగా జరిగే నష్టం జరిగిపోతోంది. అనుమతితో సంబంధం లేకుండా రక్షణ చర్యలు పాటించడం, భద్రతా చర్యలు తీసుకోవడం అవసరమని అధికారులు సూచిస్తున్నారు. మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుంటే ప్రమాదాల నివారణ సాధ్యమని అంటున్నారు.

నివాసాల్లో అగ్ని ప్రమాదాల నివారణ ఇలా..

- పిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు, మండే పదార్థాలు అందుబాటులో ఉంచవద్దు
- సిగిరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పకుండా పారేయరాదు
- ఐఎస్ఐ ఎలక్ట్రికల్ పరికరాలనే ఉపయోగించాలి
- పాడైన విద్యుత్ తీగలు తాకొద్దు. ఓవర్ లోడ్ వేయవద్దు. నాణ్యమైన ప్లగ్ మాత్రమే వాడాలి.
- మంచంపై పడుకుని బీడీలు, సిగరెట్లు తాగొద్దు.
- ఎక్కువరోజులు బయటకు వెళ్లాల్సి వస్తే విద్యుత్ మెయిన్ ఆఫ్ చేయాలి
- నీటి నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలి
- వంటింటి కింద, పైభాగంలో గాలి, వెలుతురు ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలి
- పిల్లలను వంటగదుల్లో వదలరాదు
- ఐఎస్ఐ మార్కు గల కొత్త గ్యాస్‌పైపు వాడాలి
- వంటలు పూర్తయ్యాక వెంటనే రెగ్యులేటర్ వాల్వ్ ఆఫ్‌చేయాలి
- గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ వాల్వ్ ఆపేయాలి. ఆ వెంటనే విద్యుత్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయవద్దు
- తాటాకు, గడ్డితో తయారు చేసిన పైకప్పును స్కూళ్లు, ఆస్పత్రుల్లో వాడవద్దు
- ఫ్లేమ్‌ప్రూఫ్ మోటార్ స్పార్క్ స్విచ్‌లనే ఉపయోగించాలి
- స్కూళ్లు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్‌లో ఫైర్ ఫైటింగ్ ఎగ్జిషర్లను అందుబాటులో ఉంచాలి
- ఫైర్ ఎవాక్యుయేషన్ డ్రిల్లును ప్రతీ మూడునెలలకోసారి ప్రాక్టీసు చేయాలి
- వంటగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచరాదు
- వంట చేస్తున్నప్పుడు నూలు వస్త్రాలు, ఆప్రిన్ ధరించాలి.

వ్యక్తిగత జాగ్రత్తలు..

- దుస్తులకు నిప్పు అంటుకుంటే పరుగెత్తవద్దు. నేలపై దొర్లండి లేదా దుప్పటి చుట్టుకోవాలి
- కాలిన శరీరంపై చల్లని నీరు పోయరాదు
- పొగతో నిండిన గదుల్లో మోచేతులు. మోకాళ్లపై పాకరాదు. ముక్కు, నోటికి అడ్డుగా తడిగుడ్డ పెట్టుకోవాలి.

గ్రామాల్లో..

- ఎండిన గడ్డినే వాముగా వేయాలి
- నివాసాలకు 60 అడుగుల దూరంలో వాములు వేయాలి
- పెద్దగడ్డివాములకు బదులుగా చిన్నవి వేయాలి
- గుడిసెలకు మధ్య కనీసం 30 అడుగుల దూరం పాటించండి
- విద్యుత్ ప్రమాదాలపై నీటిని ఉపయోగించరాదు. పొడి ఇసుకను మాత్రమే వాడాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాకాలంలో కుంటలు, జలపాతాల వద్దకు స్నానాలకు వెళ్లవద్దు. వరదల సందర్భంగా అజాగ్రత్తగా ఉండొద్దు. ఇంట్లో దేవునికి దీపం వెలిగించి ఊరికి వెళ్తే ఎలుకలతో అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉంది. నూనెను తాగిదీపం వత్తిని ఎలుకలు తీసుకెళ్తాయి. ఈవిషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. కింద బట్టలు ఉంటే పైన అగర్‌బత్తులు వెలిగించరాదు. ఏ ప్రమాదం జరిగినా అగ్నిమాపక సిబ్బందిని వెంటనే సంప్రదించాలి.

– అనిల్‌కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి

పేదల సంక్షేమమే లక్ష్యం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

జ్యోతినగర్(రామగుండం): పేదల సంక్షేమమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. జంగాలపల్లె శివారులోని డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల సముదాయంలో రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సరఫరా తదితర పనులకు బల్దియా కమిషనర్ అరుణశ్రీతో కలిసి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. మహంకాళి స్వామి, రహీం, ఈదునూరి రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, నర్రాశాలపల్లె, మల్కాపూర్ ప్రాంతాల్లో ఇటీవల మృతి చెందిన చిలుముల గట్టయ్య, శ్రీరాముల రవి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పరామర్శించారు.

కాంగ్రెస్ మద్దతుదారుల గెలుపు కోసం కృషి

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల గెలుపుకోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. ఖాజీపల్లిలో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా పనిచేయాలని సూచించారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు అజ్మతుల్లా హుస్సేన్, సంగీతం శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, కొలిపాక సుజాత, పెద్దెల్లి ప్రకాశ్, అనిల్‌కుమార్, మహేశ్, ముస్తఫా, ఎల్లయ్య, రహీం, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య


రాజశేఖర్ మృతదేహం

కోరుట్లరూరల్: అనారోగ్యంతో బాధపడుతూ.. కోరుట్ల మండలం అయిలాపూర్‌కు చెందిన మైలారం గోపాల్ (53) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గోపాల్ యూసుఫ్‌నగర్ పంచాయతీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవలే గుండెకు స్టంట్ వేశారు. మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఊరు శివారులో ఉరేసుకున్నాడు. అటువైపు వెళ్లిన వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చా రు. గోపాల్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య గౌతమి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి వలసజీవి..

ధర్మపురి: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ వలస జీవి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మపురి మండలం తీగలధర్మారానికి చెందిన అలకుంట రాజశేఖర్‌కు ఎనిమిదేళ్ల క్రితం పట్టణానికి చెందిన జ్యోతితో వివాహమైంది. వారికి ఓ కుమారుడు సంతానం. రాజశేఖర్ కొన్నాళ్లుగా దుబాయి వెళ్లి వస్తున్నాడు. జ్యోతి పుట్టింటి వద్ద ఉంటోంది. స్వగ్రామంలోనే కలిసి ఉందామని, త్వరగా ఇంటికి రావాలని జ్యోతి రాజశేఖర్‌ను పలుమార్లు ఫోన్‌లో కోరుతోంది. ఈ క్రమంలో సుమారు రెండు నెలల క్రితం రాజశేఖర్ స్వగ్రామానికి వచ్చాడు. నెల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకోగా.. జ్యోతి పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రావాలని రాజశేఖర్ పలుమార్లు కోరినా ఆమె నిరాకరించింది. మనస్తాపానికి గురైన రాజశేఖర్ మంగళవారం పురుగుల మందు తాగాడు. బంధువులు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇల్లు కట్టలేదని భార్య..

జూలపల్లి(పెద్దపల్లి): ఇల్లు కట్టలేదనే మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన మెండె రజిత(35) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఎస్సై సనత్‌కుమార్ కథనం ప్రకారం.. జూలపల్లికి చెందిన మెండె రజిత – చిన్న రాజయ్య భార్యాభర్తలు. తాము నివాసం ఉండే ఇల్లు పాతది కావడంతో కొత్తది నిర్మించాలని కొంతకాలంగా రజిత తన భర్తను కోరుతూ వస్తోంది. ఆయన ఎంతకూ ఆమె మాట వినలేదు. కొత్త ఇల్లు కట్టలేదు. మనస్తాపం చెందిన ఆమె.. జూన్ 26న గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రుద్రంగి గుట్టల్లో మృతదేహం?

రుద్రంగి(వేములవాడ): హాస్టల్ వెనుక మామిడితోట పక్కన గల అడవిలో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. మృతదేహం కోసం పోలీసులు గుట్టల్లో గాలిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై రుద్రంగి ఎస్సై శ్రీనివాస్‌ను వివరణ కోరగా గొర్లకాపరులు చూసి గ్రామస్తులకు చెప్పడంతో ఈ చర్చ మొదలైనట్లు తెలిపారు. అనుమానిత స్థలంలో గాలించినట్లు పేర్కొన్నారు. మృతదేహం దొరకలేదని, గురువారం సైతం గాలిస్తామని చెప్పారు.

వరదకు దారేది?



ఇది జిల్లా కేంద్రంలోని కొత్తచెరువు మత్తడికాల్వ. ఇది పూర్తిగా కబ్జాకు గురైంది. కాలువ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే మానేరునదిలో కలిసే మత్తడినీటి కాల్వ ఇప్పుడు ఆనవాళ్లు కోల్పోయింది. గతంలో ఇక్కడ కాల్వ ఉండనడానికి ఇక్కడ సుమారు రూ.50లక్షల వ్యయంతో మత్తడికాల్వపై కల్వర్టును నిర్మించడమే నిదర్శనం. ఇక్కడి స్థలాలు కోట్ల విలువ పలకడంతో ప్రజాప్రతినిధులు, రియల్టర్లు కలిసి కాలువ భూమిని కబ్జా చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.



మీరు చూస్తున్నది రాయినిచెరువు పురాతన మత్తడికాలువ. ఇప్పుడు చెరువు లేదు. సర్కారు పట్టాలు చేసి కార్మికులకు అందించగా..లోతట్టు ప్రాంతం కాబట్టి వరదనీరు పోవడానికి కాలువను అలాగే ఉంచగా కబ్జాకు గురైంది. ఇది చెరువు నుంచి గోపాల్‌నగర్ మీదుగా రెండు కిలోమీటర్ల దూరం వరకు ప్రవహించి మానేరువాగులో కలిసేది. కాల్వ ఆనవాళ్లు పూర్తిగా లేకుండా చేసి ఇక్కడ నిర్మాణాలు జరిగాయి. సంబంధిత శాఖల అధికారులకు తెలిసీ కూడా కాల్వ స్థలాన్ని ఆధీనంలోకి తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- కబ్జా కోరల్లో మత్తడి కాల్వలు
- నిర్జీవమైపోతున్న సిరిసిల్ల చెరువులు
- జలవనరులనూ వదలని కబ్జాదారులు
- పరాధీనంలో రూ.కోట్లు విలువైన ఆస్తులు
- పట్టింపులేని మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు


చిన్నపాటి వర్షానికి జలమయమైన సంజీవయ్యనగర్ ప్రాంతం

సిరిసిల్లటౌన్: కబ్జాకు కాదేది అనర్హం అంటున్నారు అక్రమార్కులు. అధికారుల పట్టింపులేమి తనం అక్రమార్కులకు కలసొస్తుంది. సిరిసిల్లలో నిబంధనలను అతిక్రమించి మత్తడికాల్వలు కబ్జాకు గురయ్యాయి. పట్టణ నడిబొడ్డున పారే చెరువుల మత్తడి(వ్యవసాయ) కాలువలు ఇప్పుడూ పరాధీనమయ్యాయి. సంబంధిత శాఖలు అటువైపు చూడకపోవడంతో చెరువులు జీవం కోల్పోయే పరిస్థితి తలెత్తింది. కార్మిక క్షేత్రం సిరిసిల్లలో ఏళ్ల తరబడిగా చెరువుల కాల్వలు(నాలాలు) దురాక్రమణ పాలైన తీరుపై సాక్షి ప్రత్యేక కథనం.

☛ సిరిసిల్ల చుట్టూ గొలుసు చెరువులు

పూర్వీకులు వ్యవసాయం, తాగునీటి అవసరాల కోసం సిరిసిల్ల చుట్టూ తొమ్మిది చెరువులు గొలుసుకట్టు పద్ధతిలో నిర్మించారు. వర్షాలతో ఒక చెరువు నిండాక దాని కింద చెరువుకు నీరుపోయేలా తవ్వించినట్లు చరిత్రకారులు చెబుతుంటారు. ఇందులో రాయినిచెరువు, తుమ్మలకుంటలను నివాస స్థలాలుగా అభివృద్ధి చేయగా వాటి ఆనవాళ్లు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం పట్టణానికి ఇరువైపులా ఉన్న కొత్తచెరువు, కార్గిల్‌లేక్ చెరువులు పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. ఇవి నీటిపారుదల, మున్సిపల్‌శాఖల ఆధీనంలో ఉన్నాయి. అర్జునకుంట, ఈదులచెరువు, దేవునికుంట, మైసమ్మకుంట, దామెరకుంట రెవెన్యూశాఖ ఆధీనంలో ఉన్నాయి. కొత్తచెరువు, కార్గిల్‌లేక్ స్థలాలు, మత్తడి కాల్వలు కబ్జాకు గురైనట్లు ఇరిగేషన్ అధికారులే చెబుతున్నారు. కానీ చర్యలు తీసుకోవడంలో కినుక వహించడం విమర్శలకు తావిస్తోంది.

☛ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

ఒకప్పుడు ఊరి శివారులో ఉండే రాయినిచెరువు, తుమ్మలకుంట స్థలాల్లో పట్టణం విస్తరించింది. అవి లోతట్టు ప్రాంతాలు కావడంతో సాధారణ వర్షాలకే వరద పోటెత్తుతోంది. పై నుంచి వచ్చే వరదనీరు ఆయా ప్రాంతాల్లో నిలువకుండా వరదకాల్వలు లేకపోవడంతో వర్షాకాలంలో ముంపుకు గురవుతున్నాయి. ఇక చెరువుకట్టలను ఆనుకుని ఎలాంటి నిర్మాణాలు ఉండకూడదన్న నిబంధనలకు భిన్నంగా పరిస్థితి ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈదులచెరువు, అర్జునకుంట, దేవునికుంట, మైసమ్మకుంట, దామరకుంటలను రక్షించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొత్తచెరువు, కార్గిల్‌లేక్‌ల కాల్వలు, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ లెవల్ స్థలాలు కబ్జాకు గురవడంపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల చెరువులు, కాల్వలకు 30 ఫీట్ల దూరంలోపే నిర్మాణాలు జరుగుతున్నాయని వాటికి అనుమతులు ఎలా ఇస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

☛ కోట్లాది రూపాయల ఆస్తులు అన్యాక్రాంతం

కార్గిల్‌లేక్, రాయినిచెరువు, తుమ్మలకుంట, కొత్తచెరువుల మత్తడికాల్వలు అన్యాక్రాంతమయ్యాయి. వీటి విలువ వందల కోట్లలోనే ఉంటుందని రియల్ ఎస్టేట్ వర్గాల అంచనా. ఒక్కో కాలువ 33 మీటర్ల వెడల్పుతో కిలోమీటర్ల పొడవుగా ఉండే వాటి విస్తీర్ణం వందల ఎకరాలు ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం పట్టణంలో సగటున గజానికి రూ.30వేలకు తక్కువ లేదు. అందుకే అక్రమార్కులు అధికారులను మచ్చిక చేసుకుని తతంగం నడిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువులు, కాల్వల నుంచి గొలుసుకట్టు దూరంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్న నిబంధనలను కూడా అధికారులు అమలు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

సిరిసిల్లలో చెరువుల వివరాలు

చెరువు	సర్వేనంబర్	విస్తీర్ణం (ఎకరాల్లో)	కాలువ (కి.మీ)
కొత్తచెరువు	1471	85.05	4
రాయినిచెరువు	703	152.10	3
ఈదులచెరువు	991	77.29	1.5
అర్జునకుంట	757	22.36	1
దేవునికుంట	1121	9.28	1.5
మైసమ్మకుంట	1294	11.02	1
దామరకుంట	232, 233	7.38	2
తుమ్మలకుంట	142, 143	29.23	2
వర్ధనికుంట	-	-	-

కాల్వను సరిగ్గా నిర్మించలేదు



వెంకంపేట, పద్మనగర్ ప్రాంతాలు లోతట్టుగా ఉంటాయి. వర్షాలు పడితే బోనాల తదితర చెరువుల నుంచి మత్తడి కాల్వలు సిరిసిల్లకు ప్రవహిస్తాయి. పైనుంచి వచ్చే వరదనీరు వెళ్లేందుకు బస్టాండు ప్రాంతంలో కాల్వ నిర్మించినా లాభం లేదు. పెద్దవర్షం పడితే చాలు నాలాలు నిండి నీరంతా షాపుల్లోకి, రోడ్డు పైకి వస్తుంది. ఏళ్లనుంచి సమస్యను ఇప్పుడైనా పరిష్కరించాలి.

– చిక్కుడు శ్రీనివాస్, వెంకంపేట

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు


నిందితుల అరెస్టు చూపిస్తున్న పోలీసులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కరీంనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు యువకులు పోలీసులను చూసి వెనక్కి వెళ్లేందుకు ప్రయత్నించగా పట్టుకున్నారు. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి విచారణ జరపగా.. కరీంనగర్‌కు చెందిన మర్రి దీక్షిత్, సిద్ధార్థ, శశిధర్‌గా గుర్తించారు. ఎస్‌ఐ ద్విచక్ర వాహనాన్ని పరిశీలించగా.. గంజాయి ప్యాకెట్లు లభించాయి. రూరల్ స్టేషన్‌కు ముగ్గురు యువకులను తరలించి విచారణ చేపట్టారు. మర్రి దీక్షిత్ కొంతకాలంగా ఆంధ్రా నుంచి గంజాయి అక్రమంగా తెప్పిస్తూ ఇతరులకు అమ్ముకుంటూ లాభాలు గడిస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురు యువకుల నుంచి ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్లు, గంజాయిని స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఆరునెలల వ్యవధిలో అన్నదమ్ములు మృతి

- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- కాల్వశ్రీరాంపూర్‌లో విషాదం


రాజు(ఫైల్)


శ్రీనివాస్(ఫైల్)

కాల్వ శ్రీరాంపూర్(పెద్దపల్లి): ఇద్దరు అన్నదమ్ములు ఏడాది వ్యవధిలోనే వేర్వేరు కారణాలతో మృతి చెందడం ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన తూండ్ల రాజు(35) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఆర్థిక ఇబ్బందులతో పది నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడాది వ్యవధిలోనే ఇద్దరు కుమారులు వేర్వేరు కారణాలతో మృతిచెందడంతో తల్లిదండ్రులు దేవమ్మ –మధునయ్య కన్నీటి పర్యంతమయ్యారు. దినసరి కూలీలుగా పనిచేసే తల్లిదండ్రులు.. వచ్చే ఆదాయంతోనే ఇద్దరు కుమారులను పెంచి పోషించి ప్రయోజకులను చేశారు. మలిదశలో తమ బాగోగు చూస్తారనుకుంటే అర్ధంతరంగా తనువు చాలించడం తల్లిదండ్రులకు శోకం మిగిల్చినట్లయ్యింది. కాగా, రాజుకు భార్య రేవతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం


గణేశ్ (ఫైల్)


రాజ్‌కుమార్ (ఫైల్)

కొడిమ్యాల/మల్యాల: వారిద్దరూ స్నేహితులు. ఒకరు ముంబయిలో ఉంటూ వంట పనులకు వెళ్తున్నాడు. మరొకరు స్థానికంగా ఉంటూ తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ముంబయి నుంచి స్నేహితుడు రావడంతో ఇద్దరూ కలిసి బైక్‌పై వేములవాడ వెళ్లేందుకు బయల్దేరారు. ఇంతలోనే వారిని విధి వెక్కిరించింది. బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొని ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ సంఘటన కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామ శివారులో చోటుచేసుకుంది. మృతులిద్దరిది మల్యాల మండలకేంద్రం. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మల్యాల మండల కేంద్రానికి చెందిన జడ సోమయ్య, లత దంపతుల కుమారుడు గణేశ్.. దయాల మల్లేశం కుమారుడు రాజ్‌కుమార్ స్నేహితులు. గణేశ్ తండ్రి సోమయ్య ఇరవై ఏళ్ల క్రితమే చనిపోయాడు. అప్పటి నుంచి లత గణేశ్‌ను పోషిస్తుండగా ఆయన ఆమెకు వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. రాజ్‌కుమార్ తల్లి గతంలోనే చనిపోయింది. మల్లేశం వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. రాజ్‌కుమార్ కొన్నాళ్లుగా ముంబయిలో ఉంటూ అక్కడే వంట పనులకు వెళ్తున్నాడు. ఓ కేసు నిమిత్తం రాజ్‌కుమార్ రెండు రోజుల క్రితం మల్యాలకు వచ్చాడు. స్నేహితుడైన గణేశ్‌తో సరదాగా గడిపారు. గణేశ్ మంగళవారం పులి వేషంవేసి వేశాడు. బుధవారం ఇద్దరూ కలిసి వేములవాడకు బయల్దేరారు. ఈ క్రమంలో కొడిమ్యాల మండలం నల్లగొండ శివారుకు చేరుకోగానే వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో దయ్యాల రాజ్ కుమార్ (25), జడ గణేశ్ (24) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల సమాచారం మేరకు కొడిమ్యాల పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని గుండెలవిసేలా రోధించారు. స్నేహితులిద్దరూ ఒకేసారి ప్రాణాలు విడవడంతో మల్యాలలో విషాదం చోటుచేసుకుంది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కొడిమ్యాల పోలీసులు తెలిపారు.


యువకుడు అదృశ్యం

కరీంనగర్‌క్రైం: నగరంలోని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన ఒక యువకుడు అదృశ్యమైనట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన మర్రిబోయిన అనిల్(25) గత నెల 26న బయటకు వెళ్లివస్తానని చెప్పి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వాళ్లు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కోరుట్లరూరల్: పట్టణ శివారు అయోధ్యపట్నం ప్రాంతానికి చెందిన కొరిమె లక్ష్మణ్ (57) గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మణ్ తన భార్య రాజవ్వ జాతీయ రహదారి పక్కన స్వీట్‌కార్న్ విక్రయిస్తుంటారు. మంగళవారం రాత్రి ఇంటికి వస్తుండగా జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం లక్ష్మణ్‌ను ఢీకొట్టి వెళ్లింది. ఈ ఘటనలో లక్ష్మణ్ అక్కడిక్కడే మృతి చెందాడు. లక్ష్మణ్‌కు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. భార్య రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టపగలు ఇంట్లో చోరీ


చిందరవందరగా పడిఉన్న వస్తువులు

జమ్మికుంటరూరల్: జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. టౌన్ సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. సైదాబాద్ గ్రామానికి చెందిన వేముల సత్యనారాయణ బుధవారం జమ్మికుంట వెళ్లాడు. అతని భార్య సుజాత ఇంటికి తాళం వేసి వనభోజనాలకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాగా.. ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా.. వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని రెండు తులాల బంగారం, 12తులాల వెండి, రూ.26వేల నగదు అపహరణకు గురయ్యాయి. టౌన్ సీఐ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం


రవీందర్ అంత్యక్రియల్లో కుటుంబసభ్యులు, బంధువులు

జగిత్యాలక్రైం: జగిత్యాలకు చెందిన రేవెళ్ల రవీందర్ (57) ఇటీవల గుండెపోటుతో ఇజ్రాయిల్‌లో మృతిచెందిన విషయం తెల్సిందే. ఆయన మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. అంత్యక్రియల్లో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

దేహదానానికి ముందుకొచ్చిన ప్రిన్సిపాల్ కుటుంబం

- మెడికల్ కాలేజీకి ఇచ్చేందుకు అంగీకారం


ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న కనకశ్రీ విజయ రఘునందన్

సిరిసిల్లకల్చరల్: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయరఘునందన్ కుటుంబం దేహదానానికి అంగీకరించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి తమ దేహాలను ఇచ్చేందుకు అంగీకరిస్తూ అర్జీ పెట్టుకున్నారు. అభ్యర్థనను అంగీకరిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ బుధవారం సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ రఘునందన్ తోపాటు అతని సతీమణి, తండ్రిని సైతం దేహదానానికి ఒప్పించారు. జిల్లాలో దేహదానానికి ముందుకొచ్చిన మొదటి వ్యక్తి ప్రిన్సిపాల్ విజయ రఘునందన్. అతనితోపాటు తన కుటుంబంలోని మరో ఇద్దరిని ఒప్పించడం అభినందించాల్సిన విషయం.

యువకుల ప్రాణాలు కాపాడిన లోకో పైలెట్లు


స్కూటీతో ట్రాక్‌పైకి వస్తున్న యువకులు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ రైల్వేగేట్ వద్ద ఇద్దరు యువకులను లోకో పైలెట్లు కాపాడారు. మూసి ఉన్న రైలు గేట్ దాటేందుకు యువకులు ప్రయత్నం చేయగా.. స్కూటీ పట్టాల కంకరలో కూరుకుపోయింది. అప్పటికే సింగరేణి బొగ్గులోడ్‌తో గూడ్స్‌రైలు వేగంగా దూసుకు వస్తోంది. అయితే, ట్రాక్‌పై ఉన్న యువకులను గుర్తించిన లోకో పైలెట్ సీహెచ్ రవి, అసిస్టెంట్ లోకో పైలెట్ దీపక్ కుమార్ ఎమర్జెన్సీ బ్రేక్ వేసి రైలును ఆపారు. దీంతో గేట్ వద్ద ఉన్నవారు ఊపిరిపీల్చుకున్నారు. రైల్వే సిబ్బంది సాయంతో ద్విచక్ర వాహనాన్ని పక్కకు నెట్టేశారు. ప్రమాదం జరగకుండా చాకచక్యంగా వ్యవహరించిన లోకో పైలెట్లను స్థానికులు అభినందించారు.

అలరించిన పోలీస్ డ్యూటీ మీట్


సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాగిలం


పరీక్షలు రాస్తున్న పోలీసులు


పోటీలకు సిద్ధమైన డాగ్‌స్క్వాడ్

గోదావరిఖని: కాళేశ్వరం జోన్‌స్థాయి తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ప్రారంభమైంది. నైపుణ్యం, సామర్థ్యం, ప్రతిభ గుర్తించడానికి పోలీస్ డ్యూటీ మీట్ ఏర్పాటు చేశారు. రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాళేశ్వరంజోన్‌లోని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్, కుమురంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లా పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు పోటీలు నిర్వహించారు. గురువారం కూడా పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో అదనపు డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్, గోదావరిఖని, ట్రాఫిక్, ఏఆర్ ఏసీపీలు మల్లారెడ్డి, రమేశ్, శ్రీనివాస్ ప్రతాప్, సీఐలు బాబురావు, సతీశ్, చంద్రశేఖర్‌గౌడ్, ఆర్‌ఐలు దామోదర్, వామనమూర్తి, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో కాసం ఫ్యాషన్స్ ప్రారంభం


కాసం ఫ్యాషన్స్ షోరూంను ప్రారంభిస్తున్న అనసూయ


నిర్వాహకులతో అనసూయ

- ఆటపాటలతో సందడి చేసిన అనసూయ

జగిత్యాల: జగిత్యాల పట్టణంలో కాసం ఫ్యాషన్స్ 18వ స్టోర్‌ను సినీ నటి, యాంకర్ అనసూయ ప్రారంభించారు. ఆధునాతన కలెక్షన్స్‌తో నిత్యం నూతన వెరైటీలతో కాసం పేరుగాంచిందని తెలిపారు. జగిత్యాలలో ఈ స్టోర్ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని, ఇది జగిత్యాల జిల్లా వాసులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. నిర్వాహకులు మల్లికార్జున్, కేదరినాథ్, శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో నాలుగేళ్లుగా ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటివరకు 18 స్టోర్‌లను ప్రారంభించామన్నారు.

షాపింగ్‌మాల్ ఎదుట సందడి

యాంకర్ అనసూయ జగిత్యాలకు రావడంతో షాపింగ్‌మాల్‌వద్ద సందడి నెలకొంది. అభిమానులు, యువత పెద్ద ఎత్తున తరలిరావడంతో షాపింగ్ మాల్ వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

రైల్వే సేవలన్నీ ఒకేయాప్‌లో..

- ఒకటి నుంచి అమలులోకి వచ్చిన రైల్‌వన్ యాప్



'రైల్ వన్' యాప్ లోగో

రామగుండం: భారతీయ రైల్వే ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలను అందించేందుకు ఒకే యాప్‌ను డిజైన్ చేసిన రైల్వే.. ఈనెల ఒకటో తేదీన అమలులోకి తీసుకొచ్చింది. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సీఆర్‌ఐఎస్) పేరిట తీసుకొచ్చిన ఈయాప్ ద్వారా అన్ని సేవలను అత్యంత వేగంతో యాక్సెస్ చేసే వీలుంటుంది.

ప్రయాణికులకు అందే సేవలు..

- ➡ టికెట్ బుకింగ్, రిజర్వ్‌డ్, అన్ రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫాం టికెట్ల బుకింగ్
- ➡ ప్లాన్ మై జర్నీ టూల్ ద్వారా వివిధ తరగతులు, కోటాలో టికెట్ల బుకింగ్
- ➡ అన్ రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫాం టికెట్లపై 3శాతం డిస్కౌంట్

రైలు స్థితి తెలుసుకోవడం...

- ➡ రైలు స్థితి, ప్లాట్‌ఫారం నంబర్, ఆలస్యం తదితర వివరాలు
- ➡ కోచ్ పొజిషన్

పీఎన్‌ఆర్ స్టేటస్ రిఫండ్..

- ➡ ముందస్తు రిజర్వేషన్ టికెట్ ప్రస్తుత స్థితిగతులు.. టికెట్ పీఎన్‌ఆర్ నంబర్ ద్వారా సీటు కన్ఫర్మేషన్ స్టేటస్.. రైళ్ల రద్దు, రిజర్వేషన్ రద్దు తదితర సేవలు

ఫుడ్ ఆర్డరింగ్..

- ➡ ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) యాప్ ద్వారా వివిధ రైల్వేస్టేషన్లకు చేరుకునేందుకు ముందు నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేసుకోవడం.. రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకున్నాక సీటు వద్దకే ఫుడ్ చేర్చడం

యాప్‌ను ఇలా డౌన్‌లోడ్ చేసుకోవాలి..

- ➡ అండ్రాయిడ్ ఫోన్లలోనే గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది.

https://play.google.com/store/apps/details?=org.cris.aikyam

IOS యాపిల్ యాప్ స్టోర్ నుంచి అయితే..

https://apps.apple.com/in/app/railone/id6473384334

ఉపయోగించే విధానం..

- ➡ యాప్‌ను డౌన్‌లోడ్ చేశాక రైల్‌కనెక్ట్ లేదా యూటీఎస్ యాప్ లాగిన్ వివరాలతో లాగిన్ కావాలి
- ➡ కొత్త వినియోగదారులు మొబైల్ నంబర్, ఓటీపీ ద్వారా రిజిష్టర్ చేసుకోవాలి
- ➡ mPI N లేదా బయోమెట్రిక్ ద్వారా సులభంగా లాగిన్ చేయవచ్చు.
- ➡ 'ప్లాన్ మై జర్నీ' లేదా 'మై బుకింగ్స్' వంటి ఆప్షన్లను ఉపయోగించి సేవలను యాక్సెస్ చేయవచ్చు.

ఇవీ ప్రయోజనాలు..

- ➡ ఒకేయాప్‌లో ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్, యూటీఎస్, రైల్‌మదద్, ఎన్‌టీఈఎస్, ఫుడ్ ఆన్ ట్రాక్ వంటి సేవలు
- ➡ బహుళ యాప్‌ల అవసరం తగ్గించి, డివైస్ స్టోరేజీలు ఆదా చేసుకోవచ్చు
- ➡ సరళమైన ఇంటర్‌ఫేస్, సింగిల్ సైన్–ఆన్ ద్వారా ఉపయోగం సులభతరం
- ➡ డిసెంబర్ 2025 నాటికి కొత్త పీఆర్‌ఎస్ సిస్టమ్ ద్వారా నిమిషానికి 1.5 లక్షల టికెట్ బుకింగ్స్, 40 లక్షల ఎంక్వైరీలను నిర్వహించగల సామర్థ్యం.